క్లుప్తంగా

ఉత్సాహంగా ఆటల పోటీలు



వాలీబాల్ ఆడుతున్న యువకులు

ఆనందపురం : మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం – ఆంధ్రా ఆటల పోటీలు ఉత్సాహపూరితంగా సాగుతున్నాయి. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పోటీల నిర్వహణకు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీల్లో యువత పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఆటల పోటీలు పర్యవేక్షించారు. కొన్నిచోట్ల నాయకులు క్రీడాకారులను ప్రోత్సహించడానికి నగదు బహుమతులు ప్రకటిస్తున్నారు. క్రీడాకారులకు ఇబ్బందులు లేకుండా ఎంపీడీవో అడపా లవరాజు, సచివాలయ కార్యదర్శులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా వెంకటరావు పుట్టిన రోజు వేడుకలు



పుట్టిన రోజు వేడుకల్లో వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, తదితరులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంగివలసకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు పుట్టిన రోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకులు, యాదవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పద్మనాభం : మండలంలోని పొట్నూరులో 17 ఏళ్ల బాలిక అదృశ్యమైనట్టు పద్మనాభం పోలీసులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన బాలిక మళ్లీ ఇంటికి రాలేదు. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కొత్తపేటలో తూర్పు కాపుల సమావేశం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు కొత్తపేటలో బుధవారం తూర్పు కాపుల సమావేశం ఉత్సాహంగా జరిగినట్టు జై భవానీ తూర్పు కాపు సంఘం భీమిలి అధ్యక్షుడు పతివాడ సూర్య వెంకటరావు తెలిపారు. సమావేశంలో అయినాడ, కుసులవాడ గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు.

217 మంది విద్యార్థులకు వైద్యసేవలు



తూడెంలో వైద్య శిబిరంలో విద్యార్థులు, సిబ్బంది

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ బుధవారం తూడెం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో 217 మంది విద్యార్థులకు వైద్యసేవలు అందించారు. పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతి స్వామి ఈ సందర్భంగా ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి నరసయ్యమ్మ, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు వి.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవాల ముంగిటకే పశు వైద్యం



- 19 నెలల్లో 2,677 పశువులకు వైద్యం
- సంచార వాహనం ద్వారా సేవలు
- దేశ చరిత్రలోనే వినూత్న కార్యక్రమం
- కొరత లేకుండా మందుల సరఫరా
- పాకల వద్దే పశువులకు శస్త్ర చికిత్సలు



సంచార వాహనంతో వైద్యులు

ఆనందపురం : మనుషులకు బాధ కలిగితే తన మాటలతో ఇతరులకు వ్యక్తపరుస్తారు... అనారోగ్యం సంభవిస్తే తోటి వారి సాయంతో ఆస్పత్రులకు తరలివెళ్లి చికిత్స పొందుతారు... మరి మూగజీవాలు అనారోగ్యానికి గురైతే వాటిని చికిత్స కోసం ఆస్పత్రులకు తరలించాలంటే కష్టసాధ్యమయ్యే పని. ఆస్పత్రులకు తీసుకెళ్లలేక.. స్థానికంగా వైద్యం అందక పశువులు మృత్యువాత పడేవి. ఫలితంగా పాడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లేది. దీంతో మనుషులు వలే పశువులకూ స్థానికంగా పశు వైద్యం అందించాలని ప్రభుత్వం ఆలోచన చేసింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవకు రూప కల్పన చేశారు. టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారమందిస్తే వెంటనే వాహనంతో వైద్య బృందం తరలివెళ్లి పశువులకు వైద్యం అందిస్తున్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన పశువులకు సంచార వాహనంలోనే శస్త్ర చికిత్సలు చేసి ప్రాణాలు కాపాడుతున్నారు. భీమిలి నియోజకవర్గంలో ఆనందపురానికి మొదటి సంచార వాహనం కేటాయించారు. అనంతరం సేవలను విస్తత పరచడానికి భీమిలి మండలానికి రెండో వాహనం కేటాయించారు.

వాహనంలో సకల సౌకర్యాలు

- పశు వైద్యం కోసం సంప్రదించాల్సిన టోల్ ఫ్రీ నంబర్ 1962
- సంచార పశు వైద్య వాహనంలో ఒక వైద్యుడు, సహాయకుడు, అటెండర్ ఉంటారు.
- 20 రకాల పేడ సంబంధిత పరీక్షలు, 15 రకాల రక్త పరీక్షలు చేయడానికి మైక్రోస్కోప్‌తో కూడిన ప్రయోగశాల వుంది.
- అత్యవసర సమయంలో పశువులను వాహనంలోకి ఎక్కించడానికి హైడ్రాలిక్ లిఫ్ట్ సౌకర్యం.
- ప్రాథమిక వైద్య సేవలతోపాటు, శస్త్ర చికిత్సలు చేసేందుకు వాహనంలో ఏర్పాటు.



సంచార వాహనం వద్ద ఆవుకు శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

పుష్కలంగా అందుబాటులో టీకాలు

గాలికుంటు వ్యాధి టీకా, గొంతవాపు, జబ్బవాపు టీకాలు, పెయ్యిదూడలకు బ్రూసెల్లా టీకా, ముద్ద చర్మ వ్యాధికి గోట్ పాక్స్ టీకా, గొర్రెలు, మేకలకు షీప్ పాక్స్, గోట్ పాక్స్ టీకాలు, పందులకు సీఎస్ఎఫ్ టీకా, కుక్క కాటుకు సంబంధించి రేబిస్ టీకాలు, నట్టల నివారణ మందులు సంచార వాహనంలో అందుబాటులో ఉంచుతున్నారు.

పాకల వద్దే పశు వైద్యం



పశువులు ఎక్కడ ఉంటే అక్కడికే వాహనం ద్వారా వచ్చి సేవలు అందిచడం నిజంగా గొప్ప విషయం. గతంలో పశు వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందేవి. ప్రస్తుతం పశువులకు సంచార వాహనం ద్వారా అత్యవసర సేవలు అందడంతోపాటు, మందులు కూడా ఉచితంగా అందించడంతో చాలా ఉపయోగకరంగా మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– కొమ్మూరు పరదేశి, రైతు నగరప్పాలెం.

పశువుల ప్రాణాలు కాపాడుతున్నారు



పశువులకు అనారోగ్యం సంభవిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1962కు సమాచారం అందిస్తే వెంటనే సంచార వాహనంతో వైద్యుడు వచ్చి సేవలు అందిస్తున్నారు. దీంతో సమయం ఆదా కావడంతోపాటు పశువులకు సకాలంలో వైద్యం అందుతోంది. గతంలో పశువులను తీసుకుని ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బందులు తొలగిపోయాయి.

– కోన సంతోషి, రైతు, బీపీ కళ్లాలు.

బాధితులకు బీమా సాయం అందజేత



బాధితురాలికి నగదు అందజేస్తున్న నాయకులు

ఆనందపురం : రోడ్డు ప్రమాదంలో, సాధారణంగా మరణించిన వ్యక్తుల కుటుంబ సభ్యులకు నాయకులు వైఎస్సార్ బీమా తక్షణ నగదు సాయాన్ని బుధవారం అందజేశారు. మండలంలోని మామిడిలోవ పంచాయతీ, దిబ్బమీదపాలేనికి చెందిన బలిరెడ్డి నాగేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ మేరకు నాగేశ్వరరావు భార్య ఆదిలక్ష్మికి, అలాగే అనారోగ్యంతో మృతి చెందిన మామిడిలోవకు చెందిన ఆదాడ మల్లేశ్వరరావు భార్య గణపతికి చెరో రూ.10 వేలు చొప్పున తక్షణ నగదు సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బలిరెడ్డి చంటి, మాజీ సర్పంచ్ బలిరెడ్డి మహేష్, మాజీ వైస్ ఎంపీపీ డోల దేవుడు, నాయకులు నాగేశ్వరరావు, గంట్రెడ్డి గోవింద్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బోరు నిర్మాణానికి భూమిపూజ

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు చిల్లపేటలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నిధులతో బోరుబావి నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు చిల్ల భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు బింగి హరికిరణ్ రెడ్డి, సచివాలయం కన్వీనర్ సరగడ శివాంజనేయ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మునకాల ఆదినారాయణ రెడ్డి, దల్లి అప్పలరెడ్డి, జీరు రాము, డెక్కతి శ్రీనివాసరెడ్డి, జీరు గురయ్యరెడ్డి, దల్లి జగదీశ్వరరెడ్డి, సీహెచ్ దేవుడు, గంగాధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న పిళ్లా సూరిబాబు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం ఈ నెల 29 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం ఆలయంలో నిర్వహించిన సమావేశంలో పిళ్లా సూరిబాబు, పిళ్లా చంద్రశేఖర్ మాట్లాడారు. జాతర గట్టుపై వెలసిన శ్రీ పంచముఖ ఆంజనేయ, షిర్డీసాయినాథ సహిత దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. శుక్రవారం క్షేత్రపాలకుడు పంచముఖ ఆంజనేయ స్వామికి సుగంధ పంచామృత అభిషేకాలు, అనంతరం నాగవల్లి దళార్చన, సింధూరార్చన, పుష్పార్చనతో వేడుకలు ప్రారంభిస్తామని తెలిపారు. శనివారం దుర్గాలమ్మ మూలవిరాట్‌కు పంచామృత, సుగంధ, జలాభిషేకాలు, పుష్పార్చన, కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పీవీజీ అప్పారావు, నాగోతి తాతారావు, పోతిన పైడిరాజు, భోగవిల్లి రాము, పిళ్లా శ్రీనివాసరావు, పీస రామారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు న్యాయం చేస్తాం



అంగన్‌వాడీ కార్యకర్తల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది సమస్యలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తప్పకుండా పరిష్కరిస్తారని, ఆ మేరకు చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఇక్కడి క్యాంపు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు అక్కడకు చేరుకుని వారి నుంచి వినతిపత్రం స్వీకరించారు. వేతనాలు పెంచడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ అంగన్‌వాడీలు ప్రభుత్వంలో భాగస్వాములేనని, వారి పట్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో సానుకూలంగా ఉన్నారన్నారు. తప్పకుండా అందరికీ మంచి జరుగుతుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తానుకూడా సీఎం జగన్‌ను కలిసి సమస్యలు తెలియజేస్తానని వెల్లడించారు. నాయకులు వెంకటలక్ష్మి, పద్మ, అనురాధ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



మధురవాడ జోనల్ ఆఫీసు వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు

మధురవాడ: మున్సిపల్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సమ్మెలో భాగంగా బుధవారం మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద కార్మికులు మోకాళ్లపై నిల్చుని నిరశన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ అండ్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఉప ప్రధాన కార్యదర్శి ఎంవీ ప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సీహెచ్ శేషుబాబు, జి.కిరణ్, బి.నర్సింగరావు, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు కె.సన్ని, ఎస్.చిన్న, సీఐటీయూ నాయకులు డి.అప్పలరాజు పాల్గొన్నారు.

- మున్సిపల్ కార్మికుల సమ్మె 2వ రోజుకు చేరుకోవడంతో జీవీఎంసీ 6, 7వ వార్డుల్లో చెత్త తరలించే క్లోజ్డ్ కంపాక్ట్ బిన్ వాహనాలు అడ్డుకున్నారు. వాహనాలకు అడ్డంగా కూర్చొని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బి.రాంబాబు, రవి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇళ్లు



రెడ్డిపల్లిలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: పేదల జీవితాలు మెరుగుపడాలంటే మరోసారి సీఎం జగన్‌మోహన్ రెడ్డే ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీలో బుధవారం రాత్రి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 33 రకాల పథకాలు అమలు చేస్తూ పేదలను లక్షాధికారులను చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు కలిపి అందరికీ ఒకేచోట కాలనీ ఇళ్లు కేటాయించారన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి కాలనీ ఇళ్లు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా కృష్ణాపురం సచివాలయంలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు సిరుగుడి ఆదినారాయణ, ఎంపీడీవో కె.ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఈర్ల ఈశ్వరావు, మరగడ అప్పారావు, బేపల గురునాయుడు, పల్లంటి చిన్నారావు, మొకర అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆనందపురం : మండలంలోని పలు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సబ్ స్టేషన్ ఏఈ సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా వెల్లంకి, బొడ్డపాలెం, గారిపేట తదితర గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాల అభ్యున్నతి



మధురవాడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సంతపేటలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- మధురవాడలో రూ.2.85 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మధురవాడ: అన్ని వర్గాల ప్రజల జీవితాలు బాగుండాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రూ.2.85 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆర్‌టీసీ కాలనీ, నగరంపాలెం రోడ్డులో నిర్వహించిన సభల్లో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఒక్క 7వ వార్డులోనే ఇప్పటి వరకు రూ.90 కోట్లతో కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. టీడీపీ, సినిమా పార్టీల నాయకులు వచ్చి ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తారని, వారి కల్లబొల్లి కబుర్లు నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ కె.కనక మహాలక్ష్మి, ఈఈ శాంతిరాజు, వార్డు ఇన్‌చార్జి పోతిన శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, జిల్లా నాయకులు పిళ్లా సూరిబాబు, అప్పన్న, బాబ్జి, వాండ్రాసి రవికుమార్, బంగారు ప్రకాశ్, పసుపులేటి గోపి, బెల్లాపు పాపారావు, తమ్మినేని వరలక్ష్మి, అల్లాడ లింగేశ్వరరావు, ఎంవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఒకటో వార్డులో రూ.1.16 కోట్లతో అభివృద్ధి పనులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట, సంతపేట, చిట్టివలస, కొత్తపేట, కొండపేట గ్రామాల్లో రూ.1.16 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బీటీ రోడ్డు, రక్షణగోడ, వాలు ప్రాంతంలో మెట్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం సాయంత్రం శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంతపేటలో ఆయన స్థానికులతో మాట్లాడారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన భీమిలి ప్రజలు తనకు మరోమారు అవకాశం ఇవ్వాలని కోరారు. వార్డులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.132 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.4.60 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేసినట్టు తెలిపారు. పొరపాటున చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితే జన్మభూమి కమిటీల రుబాబు, అవినీతి, స్వార్థం పెరిగిపోతాయన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమాలలో జెడ్పీ బి.రాము, కార్పొరేటర్ అక్కరమాని పద్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వైఎస్సార్ సీపీ రెండో వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, నమ్మి లక్ష్మణరావు, మాజీ కౌన్సిలర్లు ఉప్పాడ నాగేశ్వరరావు, జీవీ రమణ, యూత్ అధ్యక్షుడు అక్కరమాని చినబాబు, చింగుంట శివ, వెంపాడ వెంకటరమణ, తమ్మిన కూర్మారావు, పి.రవి, కుమిలి సూర్యనారాయణ, రొక్కం శ్రీను, వంశీరెడ్డి, నీలాతి రాము తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసిన పార్టీనే నమ్మండి

కొమ్మాది: అధికారం కోసం అబద్ధాలు చెప్పకుండా, అభివృద్ధి చేసే పార్టీ వైఎస్సార్‌సీపీ అని, ఈ విషయాన్ని ప్రజలంతా గమనించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ పరిసర ప్రాంతాల్లో రహదారులు, కల్వర్టుల నిర్మాణం కోసం బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. కోటి పది లక్షల రూపాయల వ్యయంతో పనులు త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాల పాలనకన్నా ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనలో భీమిలి నియోజకవర్గం మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందిందన్నారు. పంచాయతీ నుంచి వార్డుల వరకు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేశామన్నారు. రానున్న ఎన్నికల కోసం అనేక మంది వస్తారని, వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. చేస్తానని చెప్పే ప్రభుత్వం కావలో, చేసి చూపించే ప్రభుత్వం కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కనక మహాలక్ష్మి, కార్పొరేటర్ లొడగల అప్పారావు, ఏఈ శ్రీధర్, క్లస్టర్ ఇన్‌చార్జులు గుడ్ల పోలిరెడ్డి, ఉప్పలూరి గోపి, నాయకులు లొడగల రామ్మోహన్, నొడగల రాంబాబు, మాదు చంటి, చెన్నా ఎల్లయ్య, చెన్నా దాసు, రమణమూర్తి, అప్పలస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులతో తిరుమల విద్యా సంస్థల ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస తిరుమల విద్యా సంస్థలో విద్యార్థులకు యాజమాన్యం బుధవారం ప్రోత్సాహకాలు అందజేసి, సన్మానించింది. ఈ సందర్భంగా విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు మాట్లాడుతూ గతేడాది ఐఐటీ, ఐఐఐటీ, ఎన్ఐటీ, బిట్స్ పిలానీ వంటి సంస్థల్లో తమ విద్యార్థులు 156 మంది, మెడిసిన్ సీట్లు 23 మంది సాధించారని తెలిపారు. అలాగే ఫస్టియర్ ఎంపీసీలో 460 మార్కులు దాటిన 163 మంది, బైపీసీలో 430 మార్కులు దాటిన 13 మందికి, టెన్త్‌లో 575 మార్కులు దాటిన 73 మంది విద్యార్థులకు రూ.38 లక్షల ప్రోత్సాహక నగదు బహుమతులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కేఎస్‌వీవీ సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, ఇ.మృత్యుంజయరావు, ఏఎంసీ అసోసియేట్ ప్రొఫెసర్ హేమరాధిక తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐవోతో గీతం అవగాహన ఒప్పందం

కొమ్మాది: సముద్ర పరిశోధన సంస్థలో ఒకటైన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఓషనోగ్రఫీతో సంయుక్త పరిశోధనలు జరపడానికి, పరస్పర సహకారానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. స్కూల్ ఆఫ్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ సమక్షంలో ఎన్ఐవో ఇన్‌చార్జి ప్రొఫెసర్ వీవీఎస్ఎస్ శర్మ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు.

ట్యాబ్‌లతో సాంకేతిక పరిజ్ఞానం పెంపు



రెడ్డిపల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ట్యాబుల పంపిణీకి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి 11 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 451 మందికి ట్యాబ్‌లు, రెడ్డిపల్లి ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు సిరుగుడి ఆదినారాయణ సమకూర్చిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను 73 మంది విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్యాబ్‌లు వినియోగించుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానంతో పోటీ పడాలని సూచించారు. ఏ దేశం వెళ్లినా ఇంగ్లిష్ భాష రావాలన్నారు. విద్యార్థులు ఆంగ్ల భాషపై మరింత పట్టు సాధించేందుకు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టామని తెలిపారు. విద్యార్థుల మెదడుకు సానపెడితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ, ఎంఈవోలు పి.రమణ, ఎస్‌డీ బాబూలాల్, డీసీఈ బోర్డు సెక్రటరీ ఎంపీ కష్ణ కుమార్, రెడ్డిపల్లి హైస్కూల్ హెచ్ఎం ఎం.సన్యాసిరావు, ఆసరా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డిపల్లి జగదీష్ బాబు, ఆపస్ జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



చిట్టివలస బాలికల హైస్కూల్‌లో విద్యార్థినులకు ట్యాబ్‌లు అందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు రోజామణి, తదితరులు

విద్యార్థినులకు ట్యాబ్‌ల పంపిణీ

తగరపువలస: చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌లో బుధవారం 46 మంది విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్.రోజామణి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, పాశల శివ, స్కూల్ కమిటీ చైర్మన్ పి.కుమారి, ఉపాధ్యాయుడు ఉదయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.